సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 107 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం | 17.08.2025




వైద్య శాఖలో ఖాళీలు

## భర్తీ చేయాలి

- జాతీయ ఆరోగ్య మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్

4 లో



Sunday special

# తెగుతున్న అనుబంధం

- మనుషుల్లో పెరుగుతున్న దూరం
- కట్టడి కాకుంటే సమాజానికి ప్రమాదమే..

నేటి ఆధునిక యుగంలో మనిషి జీవన విధానం వేగంగా మారుతోంది. సాంకేతికత, ఉద్యోగాల ఒత్తిడి, నగరీకరణ ఇవన్నీ కలసి మానవ బంధాల అనుబంధాన్ని తగ్గిస్తున్నాయి. ఒకప్పుడు పండుగలు, వివాహాలు, అంత్యక్రియలు కుటుంబాన్ని కలుపుకునే అవకాశాలుగా ఉండేవి. ఇప్పుడు అవి కేవలం 'ఫార్మాలిటీ'లుగా మారిపోయాయి. పెద్దింటి మేడ మీద పండగ జరుపుకునే వాళ్లం, ఇప్పుడు వాట్సాప్ స్టేటస్‌లో శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాం.. సమాజంలో మానవ జీవితం బంధాలతోనే అందంగా, అర్థవంతంగా ఉంటుంది. రక్తసంబంధాలు, స్నేహబంధాలు, సామాజిక బంధాలు ఇవన్నీ కలిసే మన జీవితానికి సారాంశం ఇస్తాయి. కానీ ఆధునిక యుగంలో ఈ బంధాలు క్రమంగా బలహీనపడుతున్నాయనేది వాస్తవం.

3 లో



కలెక్టరేట్‌ను

## ముట్టడిస్తాం

జనగామ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా గానుగుపహాడ్, చిటకోడూర్ బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 18వ రోజుకు చేరుకున్నాయి. అధికారులు స్పందించకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తామని బ్రిడ్జి సాధన సమితి హెచ్చరించింది.

3 లో



న్యూజిలాండ్‌కు

## మనోళ్లు..

భారతదేశ 79వ స్వతంత్ర దినోత్సవాన్ని న్యూజిలాండ్, ఆక్లాండ్‌లో ఇతర ప్రదేశాల్లో, భారతీయ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేయడం కోసం సాంస్కృతిక సంబురాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి దేశం మొత్తంలో తెలంగాణ నుంచి ఆరుగురు ప్రముఖ కళాకారులు న్యూజిలాండ్‌కు వెళ్లారు.

4 లో

ఘనంగా కృష్ణాష్టమి

## వేడుకలు

- జనగామలో వైభవంగా శ్రీకృష్ణ రథోత్సవం
- ఆకట్టుకున్న రాధాకృష్ణుల వేషధారణలు

2 లో



# యువత ధర్మ మార్గంలో నడవాలి



**జనగామ, మన చౌరాస్తా :** విశ్వహిందూ పరిషత్ షష్ట్యాబ్ది స్థాపన దివస్ పురస్కరించుకొని జనగామ జిల్లా విభాగ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి, స్థాపన దివస్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. చిన్నారులతో రాధా కృష్ణుల వేషధారణ పోటీలు నిర్వహించారు. పలువురు చిన్నారులు భగవద్గీత శ్లోకాలు, పాటలు, కీర్తనలు, కథలతో అలరించారు. శోభాయమానంగా పండగవాతావరణంలో చిన్నారులందరూ కలిసి నృత్యాలు చేశారు. ప్రదర్శనలో ఆకర్షణీయంగా నిలిచిన పలువురు విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. తొమ్మిది నెలల నుంచి ఏడాది లోపు పిల్లలు సైతం బాలకృష్ణుడిగా బుడిబుడి అడుగులతో ముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ కృష్ణుడు జగద్గురువుగా మహత్తర గీతోపదేశం చేసి, మానవాళికి ధర్మసూత్రాలను బోధించారని అన్నారు. కృష్ణుడి ఆరాధన మాత్రమే కాదు ఆయన చూపిన ధర్మమార్గంలో యువత నడవాలని, ధర్మ రక్షణ కోసం ముందు నిలవాలని అన్నారు. కార్యక్రమంలో త్రిపురారి పద్మ, పాశం శ్రీశైలం, కందాడి మల్లారెడ్డి, యెలసాని రాంబాబు, ఆర్టీఏ మెంబర్ అభిషేక్ గౌడ్, చిలువేరు హర్షవర్ధన్, బొల్లు జాన్సి, ఇట్టబోయిన రాజు, సత్యం, కుందారపు బైరునాథ్, శ్రీనివాస్ రెడ్డి, చంద్రమౌళి, సంజీవరెడ్డి, నాగరాజు, సాయిసుజీత్, రవి రెడ్డి దేవాలయ కమిటీ సభ్యులు, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దల్, మాతృమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు..



# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


**జనగామ, మన చౌరాస్తా :**

జనగామ జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మదినాన్ని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా జనగామ బస్టాండ్ చౌరస్తా నుంచి నెహ్రూ పార్క్ వరకు శ్రీకృష్ణుడి రథోత్సవం నిర్వహించారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు, మహిళల కోలాటాలతో, బాణాసంచా ధ్వనులతో అత్యంత భక్తి శ్రద్దలతో ఈ యాత్ర సాగింది. తర్వాత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేదంపండితుల ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుడికి పూజలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడి, గోపికల వేషాధారనతో అలరించారు. కూచిపూడి నృత్యంతో ఆకట్టుకున్నారు, తర్వాత చిన్నారులచే ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో పులిహోర, స్వీట్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు కమిటీ ముఖ్య నాయకులు కనుగంటి ముత్తయ్య యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బనుక సిద్ధిరాజ్ యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ బల్దె సిద్ధిలింగం, వారాల రమేష్, తోటకూరి పాండు కృష్ణ, సాధం రాజయ్య, బక్క నాగరాజ్, కాస భాస్కర్, మారబోయిన పాండు, సింగారి ప్రశాంత్, బోడ నరేందర్, సంపత్, చౌదరపల్లి శేఖర్, భిక్షపతి, మారబోయిన ప్రకాశ్, శ్రీనివాస్, రవి, సాదం మధు, సతీష్, ప్రభాకర్, రాజు, రవి యాదవ్, లింగయ్య, రాజేష్, రమేష్, కుల సంఘాల నాయకులు, శ్రీకృష్ణ భక్తులు పాల్గొన్నారు.









కృష్ణాష్టమి వేడుకలకు రారా కృష్ణయ్య
మా శ్వాసకు శ్రుతి నీవే రారా కృష్ణయ్య

నీ పాద స్పర్శతో పునీతమయ్యె యమున అమ్మ
నీ పాద స్పర్శతో ధన్యత చెందె పుడమి అమ్మ

నీ చిన్ని పాదాల చిరుగజ్జెల సవ్వడితో
మా మదిన కోటి కాంతులు వెలిగించినావు
నీ ముద్దు లొలుకు అడుగులతో మా ఇంటిని
పావనం చేసినావు..

నీ వేణుగానంతో మమతను
పంచినావు చిలిపి కృష్ణ
మా మనసే వెన్నగా మార్చాము
ఆరగించి మమ్ము ముక్తి నీయుము చిలిపి కృష్ణ

అలుక మానరా అల్లరి కృష్ణయ్య
మా భక్తిభావపు సాక్ష్యమై కదలి రారా కృష్ణయ్య

ఈ జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుడు
చింతలన్నింటినీ దోచుకుని, మీకు ప్రేమ,
ఆనందం, శాంతి, ఆనందాన్ని
ప్రసాదించాలని కోరుకుంటూ..



**మంజుల పత్తిపాటి,**
ఆలేరు వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్
సెల్ : 9347042218

# మంత్రి వివేక్‌ను సన్మానించిన నాయకులు



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** రాష్ట్ర కార్మిక మైనింగ్ శాఖ మంత్రి జి.వివేక్ ను శనివారం భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అందిస్తున్న సంక్షేమ వివరాలను ఎప్పటికప్పటికీ ప్రజలకు తెలియజేసే బాధ్యత కార్యకర్తలదే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంగ రామచంద్రం, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడులు గజ్జేల రమేష్, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాడుగుల కృష్ణకాంత్ చింటూ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

**రవిని పరామర్శించిన మంత్రి**

ముష్కే రవిని, ఆయన కుటుంబాన్ని రాష్ట్ర కార్మిక మైనింగ్ శాఖ మంత్రి జి.వివేక్ శనివారం పరామర్శించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో తన గన్మెన్ ముష్కే రవి, ఏఆర్ సీఐ రజనీకాంత్ తల్లి లచ్చమ్మ సంవత్సరికం సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో చెన్నూరు కాంగ్రెస్ నాయకులు కరుణాసాగర్ రావు, హేమంత్ రెడ్డి, గజ్జల రమేష్, మంగ రామచంద్రం, జక్కుల అనిల్, మాడుగుల కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం : జేరిపోతుల

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా గానుగుపహాడ్, చిటకోడూర్ బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 18వ రోజుకు చేరుకున్నాయి. శనివారం నాటి దీక్షకు కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురాం మద్దతు తెలిపి మాట్లాడారు. గానుగుపహాడ్, చిటకోడూర్ బ్రిడ్జిల వద్ద ఎన్నో ప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల ప్రాణాలు పోతేనే పట్టించుకుంటారా అని ప్రశ్నించారు. కలెక్టర్ వెంటనే చొరవ తీసుకుని పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. లేకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. దీక్షలో ఎల్లబోయిన శ్రీశైలం, రావుల రఘుగౌడ్, దడిగే సంపత్, కర్రె కమలాకర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# తెగుతున్న అనుబంధం

- మనుషుల్లో పెరుగుతున్న దూరం
- కట్టడి కాకుంటే సమాజానికి ప్రమాదమే..

**నేటి ఆధునిక యుగంలో** మనిషి జీవన విధానం వేగంగా మారుతోంది. సాంకేతికత, ఉద్యోగాల ఒత్తిడి, నగరీకరణ ఇవన్నీ కలసి మానవ బంధాల అనుబంధాన్ని తగ్గిస్తున్నాయి. ఒకప్పుడు పండుగలు, వివాహాలు, అంత్యక్రియలు కుటుంబాన్ని కలుపుకునే అవకాశాలుగా ఉండేవి. ఇప్పుడు అవి కేవలం 'ఫార్మాలిటీ'లుగా మారిపోయాయి. పెద్దింటి మేడ మీద పండగ జరుపుకునే వాళ్లం, ఇప్పుడు వాట్సాప్ స్టేటస్‌లో శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాం.. సమాజంలో మానవ జీవితం బంధాలతోనే అందంగా, అర్థవంతంగా ఉంటుంది. రక్తసంబంధాలు, స్నేహబంధాలు, సామాజిక బంధాలు ఇవన్నీ కలిసే మన జీవితానికి సారాంశం ఇస్తాయి. కానీ ఆధునిక యుగంలో ఈ బంధాలు క్రమంగా బలహీనపడుతున్నాయనేది వాస్తవం.

**పూర్వం** గ్రామీణ వాతావరణంలో లేదా చిన్న చిన్న పట్టణాల్లో పెద్ద కుటుంబాలతో కూడిన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలంగా ఉండేది. ప్రతి పండుగ, శుభకార్యం, కష్టకాలం అన్నీ కలసి పంచుకునే వాతావరణం ఉండేది. ఇరుగు పొరుగువారు సైతం బంధువుల్లా కలిసిమెలిసి ఉండేవారు. సమయం మెల్లగా సాగేది. ఒకరి కోసం మరొకరు సమయం కేటాయించేవారు. నేడు సాంకేతిక, పట్టణీకరణ, వృత్తి పోటీ, వ్యక్తిగత లక్ష్యాలు ఇవన్నీ మానవ సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి.పెద్ద కుటుంబాల స్థానంలో చిన్న కుటుంబాలు పెరిగాయి. వ్యక్తిగత గోప్యత, స్వతంత్రం అనే భావన పెరగడంతో అనుబంధం తగ్గింది. సోషల్ మీడియా ద్వారా 'వర్చువల్ కనెక్షన్' పెరిగినా.. 'మనసు కలిసే స్నేహం' తగ్గిపోయింది. వారణాసిలో ఇటీవల జరిగిన ఈ హృదయ విదారక ఘటన అందుకు ఒక ఉదాహరణ. పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఆధ్యాత్మిక సాహిత్యవేత్త అయిన శ్రీనాథ్ ఖండేల్‌వాల్ (80) అనే వ్యక్తి మరణించారు. ఆయనకు రూ.80 కోట్ల ఆస్తి ఉన్నప్పటికీ, ఆయన కొడుకు, కూతురు ఆయన్ని వృద్ధాశ్రమంలో వదిలేశారు. చివరకు వృద్ధాశ్రమంలోనే ఆయన మరణించారు. చివరి చూపు చూడటానికి, అంత్యక్రియలకు కానీ ఆయన కుటుంబ సభ్యులు రాలేదు. ఆధునిక యుగంలో తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం పెరుగుతోందని ఈ ఘటన నిరూపిస్తోంది.

**ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఎక్కడ?**

పూర్వం ఉమ్మడి కుటుంబం అంటే తాతయ్య, అమ్మమ్మ లేదా నానమ్మ, అమ్మ, నాన్న అందరూ ఒకే ఇంట్లో కలిసి జీవించడం. కుటుంబ పెద్దలు అందరికీ సమానంగా మార్గదర్శనం చేయడం. బాధ, సంతోషం, పండుగ, కష్టకాలం అన్నింటిలో అందరూ కలిసే ఉండడం. ఇంట్లో పెద్దవారి అనుభవం, సలహా చిన్నవారికి పాఠం లాగా ఉండేది.

**పెద్దల పర్యవేక్షణ ఎక్కడ?**

పెద్దల పర్యవేక్షణ ఉమ్మడి కుటుంబంలో ఎంతో గొప్పగా ఉండేది. తాతలు, అమ్మమ్మలు, మామయ్యలు, అత్తలు అందరూ పిల్లలపై దృష్టి ఉంచేవారు. పెద్దవాళ్లు చిన్నప్పటి నుంచే పెద్దలను గౌరవించడం, వాక్యశుద్ధి, సహనం, సహాయ సహకారం వంటి విలువలు నేర్పించేవారు.

**అంత్యక్రియలు..**

మరణం ఒక కుటుంబానికి బాధాకరమైనది అయినా, పూర్వం ఆ బాధను పంచుకోవడంలో సమాజం ముందుండేది. సమీప బంధువులు, దూర గ్రామాల వారు కూడా పనులు మానేసి రావడం. ఏర్పాట్లలో అందరూ కలిసి పాల్గొనడం. కష్టకాలంలో ఎవరు ఒంటరిగా అనిపించుకోకుండా చేయడం. ఈ సందర్భాలు సమాజంలోని మానవతా విలువలను బలపరచేవి. కానీ ప్రస్తుతం అన్నా చెల్లెళ్లు, అన్నదమ్ములు, తోడి కోడళ్ల బంధాలు దెబ్బతిన్నాయి. ఒకప్పుడు అన్న, చెల్లెలు ఒకరి కష్టసుఖాలు మరొకరు పంచుకోవడం, చిన్నప్పటి నుంచి రక్షణ - ప్రేమతో పెరిగి, పెళ్లయినా ఆ బంధం అలాగే కొనసాగేది. అన్నదమ్ములు భూమి, వ్యాపారం, కుటుంబ పనులు అన్నీ కలసి చూసుకోవడం, విభజన వచ్చినా పరస్పర సహాయం చేసుకునేవారు.



## వివాహాలు..

పూర్వం వివాహాలు కేవలం ఇద్దరి మధ్య సంబంధం కాకుండా, రెండు కుటుంబాలు, రెండు గ్రామాలు ఒకటయ్యే పండుగలుగా ఉండేవి. బంధువులు, స్నేహితులు, పొరుగువారు అందరూ కలిసి ఏర్పాట్లలో సహాయం చేసే వారు. వివాహం కేవలం ఒక రోజు కాకుండా 3-5 రోజులు సాగే వేడుక ఉండేది. ఇక పండుగలు అంటే కేవలం ఆచారం కాదు. కలిసే సంతోషం. సంక్రాంతి, దీపావళి, దసరా ప్రతి పండుగలో పొరుగు వారితో, బంధువులతో తీపి కారాలు పంచుకోవడం. పిల్లలు గాలిపటాలు ఎగరేయడం, రంగవల్లులు వేయడం, పెద్దలు కథలు చెప్పడం. పండుగ రోజున ఎవరూ ఒంటరిగా ఉండకుండా అందరూ ఇంటికి ఆహ్వానించడం. పండుగలు కుటుంబ విలువలు, సంస్కృతిని బలపరచేవి.

## మానవ సంబంధాలకు దెబ్బ..

- నేటి కాలంలో ఉద్యోగాలు, విద్య, వ్యాపార కారణాల వల్ల కుటుంబ సభ్యులు ఒకచోట ఉండడం తగ్గింది. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడటం వలన కలిసే అవకాశాలు తగ్గిపోతున్నాయి.
- ప్రతి ఒక్కరూ తమ కెరీర్, పిల్లల చదువులు, వ్యక్తిగత జీవితంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. పంచుకోవడం, సహకరించడం కంటే స్వతంత్రంగా ఉండే మనస్తత్వం పెరిగింది.
- ఆస్తి పంచుకునే విషయంలో వచ్చే విభేదాలు బంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కొన్నిసార్లు సంపద విషయాల్లో అపోహలు ఏర్పడి సంబంధాలు దెబ్బతింటున్నాయి.
- ఫోన్, సోషల్ మీడియా ఉన్నా కూడా నిజమైన భావపూర్వక సంభాషణలు జరగడం తగ్గింది. చిన్న చిన్న విషయాల్లో కూడా మాట్లాడుకోకుండా, మనసులో పెట్టుకోవడం వల్ల దూరాలు పెరుగుతున్నాయి.
- పూర్వం 'మనం అన్నీ ఒకటే..' అనే భావన ఉండేది ఇప్పుడు 'ప్రతి ఒక్కరూ తమదే' అన్న భావనగా మారింది.

## కుటుంబ వ్యవస్థ బలహీనం..

సమాజంలో ఒకప్పుడు కుటుంబ వ్యవస్థ, ఉమ్మడి కుటుంబం బలమైన ఆధారంలా ఉండేది. అయితే నేటి కాలంలో అది క్రమంగా బలహీనమవుతోంది. దానికి గల ముఖ్య కారణాలు ఇలా ఉన్నాయి.

**నగరీకరణ (అర్బనైజేషన్):** ఉద్యోగాలు, చదువు, వ్యాపారాల కోసం గ్రామాల నుంచి పట్టణాలకు, విదేశాలకు వలసలు పెరగడం.

**ఆర్థిక స్వతంత్రం :** పురుషులతో పాటు మహిళలు కూడా ఆర్థికంగా స్వతంత్రంగా మారడం. ఇది మంచి విషయం అయినా, కొన్నిసార్లు 'మనకు మనమే సరిపోతాం..' అనే భావన పెరగడం వలన కుటుంబంపై ఆధారపడే భావం తగ్గిపోవడం.

**విలువల మార్పు :** పాత తరాలు ఇచ్చే విలువలకు కొత్త తరాలు అదే ప్రాధాన్యత ఇవ్వకపోవడం. స్వేచ్ఛ, వ్యక్తిగత అభిరుచులు, వ్యక్తిగత జీవనశైలి ముఖ్యమని భావించడం.

**ఆస్తి, డబ్బు వివాదాలు :** వారసత్వం, ఆస్తి పంచుకోవడం, ఆర్థిక సహాయం విషయంలో వచ్చే విభేదాలు. ఒకరి మీద ఒకరికి అనుమానాలు పెరగడం.

**కమ్యూనికేషన్ గ్యాప్ :** ఫోన్, సోషల్ మీడియా అతిగా వాడటంతో మనస్ఫూర్తిగా మాట్లాడుకునే అలవాటు తగ్గిపోవడం. చిన్న సమస్యలు కూడా చర్చించకుండా, మనసులో పెట్టుకోవడం వల్ల దూరాలు పెరగడం.

**వృత్తి ప్రాధాన్యత :** ఉద్యోగాల కోసం ఎక్కువ సమయం బయట గడపడం. కుటుంబ సభ్యులతో గడిపే సమయం తక్కువ కావడం.

**ఆధునిక జీవనం :** ఒత్తిడి, అధిక ఖర్చులు, పోటీ జీవనశైలి, సమయాభావం ఇవి కుటుంబం కోసం సమయం కేటాయించడంలో అడ్డంకులు.

## మన విద్యావ్యవస్థ మారాలి..

నేటి మన విద్యా వ్యవస్త ఎక్కువగా విషయపరమైన జ్ఞానం (subject knowledge), ఉద్యోగావకాశాల పైనే దృష్టి పెడుతోంది. బంధాలు, అనుబంధాలు, మానవ సంబంధాల విలువను నేర్పే విధానం చాలా పరిమితంగానే ఉంది. దీన్ని మెరుగుపరచడానికి కొన్ని కీలక మార్పులు అవసరం.

1. పాఠ్యాంశాలలో మానవ సంబంధాల పాఠాలు చేర్చడం.కుటుంబ విలువలు, స్నేహం, సహాయం, అనుబంధం గురించి కథలు, కవితలు, నాటకాలు పాఠ్యాంశాల్లో చేర్చాలి. పాఠశాల స్థాయి నుంచే 'సమాజ శాస్త్రం'లో మన సంస్కృతి, బంధాల ప్రాముఖ్యత అనే ప్రత్యేక అధ్యాయాలు ఉండాలి.
2. ప్రాక్టికల్ నాలెడ్జ్ : ఫ్యామిలీ డే, గ్రాండ్ పేరెంట్స్ ఇంట్రాక్షన్, సిబ్లింగ్ బాండింగ్.. వంటి కార్యక్రమాలు పాఠశాలల్లో నిర్వహించారు.
3. వాల్యూ ఎడ్యుకేషన్ : ప్రతి తరగతిలో వారానికి ఒక పీరియడ్ Value Education / Life Skills కి కేటాయించాలి. ఈ పీరియడ్‌లో సహానుభూతి, గౌరవం, సహకారం వంటి విలువలను చర్చల ద్వారా, కథల ద్వారా నేర్పాలి. చిన్న నాటికల ద్వారా కుటుంబ వ్యవస్థ గురించి అవగాహన కల్పించడం వంటివి చేయాలి.
4. ఉపాధ్యాయుల శిక్షణ : ఉపాధ్యాయులు స్వయంగా బంధాలు, సంబంధాల ప్రాముఖ్యతను అర్థం చేసుకుని, విద్యార్థులకు ఆ విలువలను ప్రేరణాత్మకంగా చెప్పగలగాలి.
5. తల్లిదండ్రుల భాగస్వామ్యం : పాఠశాలలు పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో పిల్లల బంధాల అవగాహన, ప్రవర్తన, సంస్కారాలపై చర్చించాలి. తల్లిదండ్రులు కూడా బంధాల విలువను ఇంట్లో పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
6. సంస్కృతి పరిరక్షణ : స్థానిక పండుగలు, ఆచారాలు, సంస్కృతిక కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహించడం ద్వారా పిల్లల్లో సహకార భావన, అనుబంధం పెరుగుతుంది.
7. సోషల్ మీడియా సద్వినియోగం : పిల్లలకు సోషల్ మీడియా బంధాలను కాపాడటానికి ఎలా ఉపయోగపడుతుందో, విభేదాలకు దారి తీసే వాడకాన్ని ఎలా నివారించాలో నేర్పాలి.

## సోషల్ మీడియా ప్రభావం..



సోషల్ మీడియా బంధాల బలహీనతకు ఒక పెద్ద కారణంగా పరిగణించవచ్చు. దూరం వేరు చేసిన మనుషులను స్క్రీన్ మళ్లీ కలిపింది.. కానీ ప్రత్యక్ష ముఖాముఖి సంభాషణ తగ్గడం ఫోన్‌లో చాటింగ్ చేయడం వల్ల ప్రత్యక్షంగా కలిసే అలవాటు తగ్గింది. ప్రదర్శన, సంస్కృతి, ఆనందాన్ని పంచుకోవడం కంటే చూపించుకోవడమే ప్రధాన లక్ష్యం అయ్యింది. ఇతరుల లైఫ్ స్టైల్ చూసి అసూయ, అసంతృప్తి పెరుగుతోంది. సమయ వ్యయం, కుటుంబంతో గడపాల్సిన సమయాన్ని స్క్రోల్ చేస్తూ వృథా చేస్తున్నారు. ఫోన్‌లో బంధాలు పెరిగినట్లు అనిపిస్తుంది, కానీ మనసులు మాత్రం దూరమవుతున్నాయి.



- వ్యాస కర్త : జుట్టు చంద్రశేఖర్
సెల్ :9059505969







# వైద్యశాఖలో ఖాళీలు భర్తీ చేయాలి

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో ఉన్నటువంటి వివిధ ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి కేవలం 4 కేటగిరీలకు సంబంధించిన పోస్టులను మాత్రం ఎం.హెచ్.ఎస్.ఆర్.డి.బి రిక్రూట్మెంట్ బోర్డ్ ద్వారా నియమించారు. మిగతా ఆల్ కేడర్స్ విషయంలో సంవత్సరాల తరబడి ఉద్యోగ ప్రకటన చేయకపోవడం వలన వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ద్వారా ఏళ్ల తరబడి ఉద్యోగాలు పనిచేస్తున్న వారి ఆశలకు అడవికి కాసిన వెన్నెల లాగా అవుతుందని జాతీయ ఆరోగ్య మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర సభ్యులు పేర్కొన్నారు. ప్రకటన ఆలస్యం కావడంతో దాదాపు సంవత్సరాల తరబడి ఎదురుచూస్తూ వయసు పైబడి ఉద్యోగాల అర్హత కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం వలన నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ నిస్పృహలతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేవలం 4 కేటగిరీలు మెడికల్ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ మినహా ఇతర పోస్టులు ఫిజియోథెరపిస్ట్, సోషల్ వర్కర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ / అకౌంటెంట్స్, డెంటల్ టెక్నీషియ



న్, ఆప్తాలమిక్ ఆఫీసర్స్, ఎన్ ఆర్ సి కౌన్సిలర్స్, ఆర్.కే.ఎస్.కే. కౌన్సిలర్స్, ఎన్ సి డి కౌన్సిలర్స్ , సైకాలజిస్ట్, డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్, మేల్ నర్సింగ్ ఆర్డర్ లీ, ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్ లీ, ఆయుష్ ఎస్ ఎన్ ఓ తదితరాలు పోస్టుల నోటిఫికేషన్ ప్రకటనలు జారీ చేయకుండా కాలయాపన చేయడం వల్ల అర్హులైనటువంటి ఎంతోమంది నిరుద్యోగులుగా మిగిలిపోవాల్సిన పరిస్థితిలో దాపరిచాయని పలువురు నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.



## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుకొండ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం దామెర మండలంలోని లాదెళ్లలోని రూరల్ హెల్త్ సెంటర్‌లో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి బీపీ, షుగర్ రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్, పాలకవర్గం మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ డాక్టర్లు జె.కిషన్ రావు, మొహమ్మద్ తయార్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివ కుమార్, ఎ. గంగాధర్, సతీష్, శ్రీకాంత్, నర్సింహాచారి, కిట్స్ విద్యార్థి జి.వర్షిత్ పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ చట్ట ప్రకారం నడుచుకోవాలి : జమాల్ షరీఫ్

**జనగామ, మన చౌరాస్తా :** ప్రతి ఒక్కరూ చట్ట ప్రకారం నడుకోవాలని అడ్వకేట్ మొహమ్మద్ జమాల్ షరీఫ్ అన్నారు. శనివారం జనగామలోని జమా మసీద్ జుహర్ నమాజ్ తరువాత నిర్వహించిన సమావేశానికి గుండ్లగడ్డ మదీనా మసీద్ అధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్ మతీన్ అతర్ అధ్యక్షత వహించగా జమాల్ షరీఫ్ పాల్గొని మాట్లాడారు. భారత్‌లో కొత్తగా రూపొందిస్తున్న చట్టం ప్రకారం మనమందరం అవసరమైన అన్ని పత్రాలు సిద్ధం చేసుకోవాలని, తద్వారా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయన్నారు. జమా మసీద్ కార్యదర్శి ఖాజా ముజ్తహిదుద్దీన్ మాట్లాడుతూ 1984 తర్వాత ఉన్న ప్రతి ఒక్కరూ జనన సర్టిఫికేట్ తో పాటు ఇతర అవసరమైన పత్రాలు తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలని, అలాగే కొత్త చట్టం గురించి మనమందరం అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో ముహమ్మద్ మసీఉర్ రహ్మాన్, మహమ్మద్ సమద్, ముహమ్మద్ ఇబ్రాహీం, మహమ్మద్ కలిమద్దీన్, మహమ్మద్ అజ్మత్ ఖాన్, మహమ్మద్ అన్వర్, మహమ్మద్ చంద్ భాయ్, మహమ్మద్ బాబా, ముహమ్మద్ ఇక్బాల్ భాయ్, మహమ్మద్ అరిఫ్ భాయ్, మహమ్మద్ అహ్మద్ షరీఫ్, బాబా, మహమ్మద్ సయీుదుద్దీన్, మహమ్మద్ ఇమ్మాద్ భాయ్, మహమ్మద్ అజ్మల్, మహమ్మద్ నసీర్, మహమ్మద్ అలీముద్దీన్, మహమ్మద్ అన్వర్, మహమ్మద్ అఫ్జల్ భాయ్, మహమ్మద్ రఫీ మతీన్, మహమ్మద్ జహీర్ భాయ్ పాల్గొన్నారు.



## న్యూజిలాండ్‌కు మన కళాకారులు

**జనగామ, మన చౌరాస్తా :** న్యూజిలాండ్ ప్రభుత్వం, ఇండియా ఎంబసీ తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా భారతదేశ 79వ స్వతంత్ర దినోత్సవాన్ని న్యూజిలాండ్, ఆక్లాండ్‌లో ఇతర ప్రదేశాల్లో, భారతీయ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేయడం కోసం సాంస్కృతిక సంబురాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి దేశం మొత్తంలో తెలంగాణ నుంచి ఆరుగురు ప్రముఖ కళాకారులు న్యూజిలాండ్ బయలుదేరారు. వీరిలో పేరిణి సంతోష్ పెరుమాండ్ల, పేరిణి రాజ్ కుమార్ నాయక్, డాక్టర్ చౌదర్పల్లి రవికుమార్, అశోక్, డాక్టర్ అందే భాస్కర్, సిద్దిపేట జిల్లా నివాసి డాక్టర్ నల్ల పాగస్వామి ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని విక్షించిన న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్ కళాకారులను అభినందించారు. వీరందరికీ ఇండియా, న్యూజిలాండ్ ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ ప్రోత్సాహం అందించారు.